క్లుప్తంగా

రేషన్ షాపు వద్ద అవే పాట్లు



కృత్తివెన్ను: రేషన్ షాపులవద్దే రేషన్ పంపిణీ విధానంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని వాలంకలో ఓ రేషన్ షాపు వద్ద విద్యుత్ లేకపోవడంతో కాటా పనిచేయలేదు. దీంతో కార్డుదారులు పడిగాపులు కాశారు. ప్రతినెలా ఇంటివద్ద చక్కగా ఇస్తున్న రేషన్ విధానాన్ని పక్కన పెట్టి మాకు ఈ తిప్పలేంటని కార్డుదారులు లబోదిబో అంటున్నారు.

జల జాగరణ యాత్ర ప్రారంభం



కోడూరు: భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో భారతీయ కిసాన్ జల జాగరణ యాత్రను మంగళవారం సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనుముల గాంధీ ప్రారంభించారు. కోడూరు మండల పరిధిలోని 11వ నంబర్ పంటకాలువ, అవుట్‌పాల్ స్లూయిస్‌లను ఆయన పరిశీలించారు. స్థానిక రైతు సంఘం నాయకుడు రేపల్లె యోగ ప్రకాష్ (రాము) రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గాంధీకి వివరించారు. ఈ సందర్భంగ గాంధీ మాట్లాడుతూ కృష్ణానదీ తీరాన అనేక నగరాలు, డ్రెయినేజీ, పారిశ్రామిక వాడల వల్ల అనేక రసాయనాలు, వ్యర్థాలతో నదీజలాలు కలుషితమవుతున్నాయని చెప్పారు. దీనివల్ల ప్రజారోగ్యం దెబ్బతింటుందన్నారు. వ్యవసాయంలో వేరు కుళ్లు తెగులు, వైరస్‌లు వాపిస్తున్నాయన్నారు. నదీజలాలను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కొలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీవీ నగరాయలు, డీసీ మాజీ చైర్మన్ గుడిసేవ సూర్యనారాయణ, కొండవీటి రామకృష్ణ, కోట సత్యనారాయణ, పలువురు బీజేపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



చిట్టూర్పు(ఘంటసాల): ఆపదలో ఉన్నవారికి శ్రీనివాసరావు సేవా స్వచ్ఛంద సంస్థ సాయం చేయడానికి ముందంజలో ఉంటుందని నిర్వాహకులు వక్కలగడ్డ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చిట్టూర్పు శివారు మగ్గాలపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త రెబ్బా రామచంద్రరావు పక్షవాతంతో బాధపడుతూ మంచానికే పరిమితం అయ్యాడు. విషయం తెలుసుకున్న శ్రీనివాసరావు సేవా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సభ్యులు రూ.4 వేల నగదు సాయాన్ని అందించారు. బూసి సుబ్రహ్మణ్యం, మల్లంపల్లి హేమాద్రి, చిలంకుర్తి మోహనకృష్ణ, పోతార్లంక శివ, కాటూరి బుజ్జి బాబు, ఈపూరి నాగబాబు, ఢీకొల్లు రవి, చిలంకుర్తి మురళీ, పూల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల అర్హత ధ్రువపత్రాల పరిశీలన



మచిలీపట్నంఅర్బన్: ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు సంబంధించి స్థానిక లేడీ యాంప్టిల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ) అర్హత ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారులు నిర్వహించారు. స్కూల్ అసిస్టెంట్లకు సమానస్థాయి పోస్టుల ఉద్యోగోన్నతి పొందేందుకు అన్ని ప్రభుత్వ, లోకల్ బాడీస్, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో ఎస్జీటీల సీనియారిటీ జాబితాలు విద్యాశాఖ విడుదల చేసింది. దీంతో సుమారు 200 మంది సీనియారిటీ జాబితాలో ఎస్జీటీలు అర్హత ధ్రువపత్రాలు, సర్వీస్ రిజిస్టర్లతో జిల్లాలోని 26 ఉద్యోగోన్నతుల పోస్టుల భర్తీకి 1: 3 నిష్పత్తిలో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ



గూడూరు: మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మల్లవోలులో మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ రూపాశ్రీ మాట్లాడుతూ మలేరియా, డెంగీ వంటి విషజ్వరాలు అరికట్టాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తరుణ్‌శంకర్, మురళి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖలో ఇష్టారాజ్యం

- కార్యాలయం ఎప్పుడు తీస్తారో, ఎప్పుడు మూస్తారో తెలియని పరిస్థితి
- సిబ్బందిదీ అదేతీరు
- రైతులకు దొరకని సరైన సమాధానం
- వ్యవసాయశాఖలో దుస్థితి



మండల వ్యవసాయ శాఖ కార్యాలయం

పెడన: పేరుకే పెడన నియోజకవర్గం. కానీ నియోజకవర్గ కేంద్రంలో వ్యవసాయశాఖ దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఏవో కార్యాలయంలో సరైన సమాధానం చెప్పేవారే కరవయ్యారు. సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావటంతో రైతులు సన్నద్ధత పనులు మొదలు పెట్టారు. పచ్చిరొట్ట విత్తనాలకోసం రైతులు ఏవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎవరూ అందుబాటులో ఉండటం లేదు. ఉన్నా వారి నుంచి సరైన సమాధానం దొరకటం లేదు. దీంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

రైతుల దుస్థితి

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల కోసం వచ్చే రైతులకు ఏవో కార్యాలయం తాళం వేసి ఉంటోంది. దీంతో రైతులు వెనుదిరిగి వెళ్లిపోతున్న దుస్థితి. ఇన్‌చార్జి ఏవో నూరున్నీసా పెడన వైపు కన్నెత్తి చూడటం లేదు. అదేమంటే నాకు పెడన ఒకటే కాదని, మచిలీపట్నం ల్యాబ్‌లో కూడా విధులు నిర్వహించాల్సి వస్తోందని చెబుతుండటం విశేషం. పచ్చిరొట్ట విత్తనాలు పెడన నియోజకవర్గంలోని బంటుమిల్లి, కృత్తివెన్ను, గూడూరు మండలాలకు కనీసం పది నుంచి 20 శాతమైన విత్తనాలు వచ్చాయి.

అధికారుల తీరుతో పెడనకు రాని పచ్చిరొట్ట విత్తనాలు..

నియోజకవర్గ కేంద్రమైన పెడనలో ఒక్క పచ్చిరొట్ట విత్తనం కూడా రాని దుస్థితి వ్యవసాయశాఖ కల్పించిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. ఏవో రాకపోతే వీఏఏలు, ఎంపీఈవోలు కార్యాలయంలో ఉండేలా చర్యలు తీసుకున్నా ఆ కార్యాలయం తాళం ఎవరి వద్ద ఉంటుందో ఎవరికీ తెలియని పరిస్థితి.

ఇష్టారాజ్యంగా..

సరైన అధికారి లేకపోవడం వల్ల వీఏఏలు, ఎంపీఈవోలు ఇష్టానుసారంగా నడుచుకుంటున్నారని, కొందరు సక్రమంగా పనిచేస్తున్నా మరికొందరు రైతులపై కోపం ప్రదర్శిస్తున్నారని, ఈ పరిస్థితిని పాలకులు సరిద్దిదాలని రైతులు మొరపెట్టుకుంటున్నారు. మధ్యాహ్నం సమయంలో వీఏఏ మరొక తాళం తీసుకురావడంతో ఎంపీఈవో సుకన్య కార్యాలయంలోకి వెళ్లి కూర్చున్నారు. కార్యాలయానికి వచ్చే వారికి ఓపికతో సమాధానం చెప్పాల్సిన క్షేత్రస్థాయిలోని సిబ్బందే కసురుకునేలా ప్రవర్తిస్తుంటే ఆరుగాలం కష్టపడే రైతుల పరిస్థితి ఏమిటంటూ వాపోతున్నారు.



గదికి తాళం వేసిఉన్న దృశ్యం

ఉన్నతాధికారులు స్పందించాలి

ఉన్నతాధికారులు స్పందించి పెడన వ్యవసాయశాఖను సరిచేయాలని పెడన మండల రైతులు విన్నవించుకుంటున్నారు.

తాళం కోసం ఎదురు చూపులు

మంగళవారం ఏవో కార్యాలయానికి పలువురు రైతులు వెళ్లితే కాకర్లమూడి ఆర్‌ఎస్‌కేకు చెందిన సుకన్య కార్యాలయం బయటే వేచి ఉన్నారు. రైతులకు సరైన సమాధానం కూడా ఇవ్వకుండా దురుసుగా ప్రవర్తిస్తున్నారనే రైతులు వాపోతున్నారు. తాళం లేక బయట అంత సేపు కూర్చున్న ఎంపీఈవో ఆ కోపాన్ని రైతులపై చూపించడం ఎంత వరకు సబబు అనే వాదన వినిపిస్తోంది. రైతులకు సరైన సమాచారం ఇవ్వకపోగా రైతులపై కోప్పడటం ఏమిటంటూ రైతులు మండిపడుతున్నారు.

అభివృద్ధి పనులు 10లోగా పూర్తి చేయాలి



మోపిదేవి బాలికల వసతిగృహంలో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

మోపిదేవి: సంక్షేమ హాస్టల్స్ అభివృద్ధి పనులు ఈనెల 10లోగా పూర్తిచేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. మండలంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం, ఆశ్రమ పాఠశాల హాస్టల్స్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిని మంగళవారం పరిశీలించారు. బాలికల వసతిగృహంలో చేపట్టిన డైనింగ్ కం లివింగ్ రూము నిర్మాణ దశలోనే ఉండటంతో ఏఈ రాజేష్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాలలో వంట గది అభివృద్ధి పని ఇప్పటికీ ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. విద్యాసంవత్సరం ప్రారంభానికి పది రోజులే ఉన్నా పనుల్లో జాప్యాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతానన్నారు. సంక్షేమ వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల మరమ్మతులకు జిల్లా కలెక్టర్ డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్స్ నుంచి రూ.46 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. వీటి ద్వారా వసతి గృహ భవనాల శ్లాబ్ రిపేర్లు, విద్యుత్, నీటి సదుపాయాల పునరుద్ధరణ, పెయింటింగ్, మరుగుదొడ్ల మరమ్మతులు, అదనపు గదుల నిర్మాణం తదితర పనులు చేపట్టినట్లు వివరించారు. వసతి గృహ వార్డెన్స్ సురేష్, నాగలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

జల, జన జాగరణ యాత్రలో..

మోపిదేవి: కాలుష్య రహిత సమాజం స్థాపనకు జాతీయ కిసాన్ సంఘ్‌తో పాటు ప్రజలు పూర్తిగా ప్రభుత్వానికి సహకరించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. మోపిదేవిలో 216 జాతీయ రహదారి పక్క ఎస్ విహార్ నందు జల, జన జాగరణ యాత్రలో మంగళవారం పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డెల్టా ప్రాంతాన్ని సంరక్షించు కునేందుకు జన జాగరణ యాత్ర ముందుకు రావడం అభినందనీయన్నారు. భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర పర్యావరణ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ, భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అనుమోలు గాంధీ, జీవీ నగరాయలు, చంద్రశేఖర్, పర్యావరణ ప్రేమికులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ ప్రారంభం

రామకృష్ణాపురం(కోడూరు): మండల పరిధిలోని రామకృష్ణాపురంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన శాఖను మచిలీపట్నం ఎంపీ వి.బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్, సర్పంచ్ దేవనబోయిన కనకదుర్గ, డెప్యూటీ తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి, బ్రాంచి మేనేజర్ ఎం. వెంకటేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు 'వెన్నుపోటు దినం'

పెడన: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా వెన్నుపోటు పొడిచిందని, ఈ మేరకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం 'వెన్నుపోటు దినం' నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 9 గంటలకు పెడనలోని వైఎస్సార్ సీపీ కార్యాలయానికి పెడన నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులంతా తరలిరావాలని కోరారు. పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం అందజేయడం జరుగుతుందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు, అందరూ తరలి వచ్చి అధినాయకుడు ఇచ్చిన పిలుపు మేరకు 'వెన్నుపోటు దినం' నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నేడు అవనిగడ్డలో..

అవనిగడ్డ: ఏడాది కూటమి పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు, పాలకులు పెడుతున్న బాధలు, అమలు చేయని హామీలకు నిరసనగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం అవనిగడ్డలో 'వెన్నుపోటు దినం' కార్యక్రమం నిర్వహించనున్నారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు వేలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులతో ప్రదర్శనగా వెళ్లి తహసీల్దార్‌కు వినతి పత్రం ఇవ్వనున్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



మాట్లాడుతున్న పీడీ రాణి

పెడన: కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం పెడన మండలం కాకర్లమూడి పాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో 15 నుంచి 18 ఏళ్ల వయస్సు గల బాలికలకు ఆరోగ్యం, నాయకత్వ లక్షణాలు, చెడు వ్యసనాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖాభివృద్ధి ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఎస్ రాణి మాట్లాడుతూ అపరిచితులను నమ్మవద్దని, సెల్‌ఫోన్లు వినియోగం తగ్గించి చదువుపై దృష్టిపెట్టాలని సూచించారు. బంటుమిల్లి ఐసీడీఎస్ పీవో ఎం.సముద్రవేణి, సూపర్‌వైజర్ శ్రావణకుమారి, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

చల్లపల్లి: కిశోరి బాలికలు పౌష్టికాహారం ఎక్కువగా తీసుకోవాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని జిల్లా శిశు సంరక్షణ శాఖ ఓఆర్‌డబ్ల్యూ సీహెచ్ నాగభవాని సూచించారు. చల్లపల్లి నారాయణరావునగర్‌లోని 13వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోర వికాసంపై కిశోరి బాలికలకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్ ఆదిలక్ష్మి, మహిళా పోలీస్ ఎస్.నాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణకు సరైన విధానాలు అవలంబించాలి

భావదేవరపల్లి(నాగాయలంక): క్షేత్రీయ భారతీయ మత్స్య పరిశోధనా సంస్థ (విశాఖపట్నం) ఆధ్వర్యంలో 'భారత దేశంలోని సముద్ర మత్స్యవనరులు- సముద్ర కాలుష్యం' అంశంపై భావదేవరపల్లిలోని ఎంవీకే రావు ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం మత్స్య పాలిటెక్నిక్ విద్యార్థులకు ఒక రోజు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సు ప్రారంభించిన అవనిగడ్డ ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ సముద్ర కాలుష్యం జీవకోటిపై ఏ విధమైన ప్రభావం చూపుతుందో తెలుసుకోవడంతో పాటు కాలుష్య నియంత్రణకు సరైన విధానాలు అవలంబించాల్సిందిగా సూచించారు. ఏపీ మత్స్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ప్రొఫెసర్ తుమ్మల సుగుణ మన దేశ మత్స్య సంపద స్థితిగతులు, సుస్థిరతలను మత్స్య పాలిటెక్నిక్ విద్యార్థులు తెలుసుకోవాలని చెప్పారు. క్షేత్రీయ భారతీయ మత్స్య పరిశోధనా సంస్థ జోనల్ హెడ్ సిధనుంజయరావు మత్స్యసంపద పరిరక్షణలో ఆధునిక పరిజ్ఞానం వినియోగించుకోవాలన్నారు. చేపల వేట పరికరాలు, రిసోర్స్ చార్టులు, నావిగేషన్ పరికరాలు, ఆధునిక రీతులకు చెందిన డెమోలను శాస్త్రవేత్తలు విద్యార్థులకు ప్రదర్శించి వివరించారు. గ్రామ సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, మత్స్య శాస్త్రవేత్త జీవీపీ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.చంద్రశేఖరరావు, ఏడీఎఫ్ ఆర్.ప్రతిభ, ఎఫ్‌డీఓ సునీత, కళాశాల బోధనా సిబ్బంది, ఫిషరీస్ విద్యార్థులు పాల్గొన్నారు.



రేపటి నుంచి మంగినపూడి బీచ్ వద్ద జరిగే మసులా బీచ్ ఫెస్టివల్ విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం స్థానిక కోనేరు సెంటర్ నుంచి 2కే రన్ నిర్వహించారు. సినీనటులు నారా రోహిత్, మంచు మనోజ్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. బెలూన్‌లు ఎగురవేశారు.
- మచిలీపట్నంటౌన్

ముగిసిన వేద పండిత సభలు



మచిలీపట్నంటౌన్: నగరంలోని బలరామునిపేటలో శ్రీ దేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం (యతిరాజ భవనం)లో మూడు రోజులుగా జరుగుతున్న శ్రీ ఉభయ వేదాంత పండిత సభలు మంగళవారంతో ముగిశాయి. వెంకటాచార్యస్వామి అధ్యక్షతన జరిగిన ఈ పండిత సభలో పలు అంశాలపై స్వామీజీలు అనుగ్రహ భాషణం చేశారు. సింగరాచార్య స్వామి శ్రీమన్నారాయణుని కల్యాణ గుణములు, శ్రీరంగనాథ స్వామి శ్రీమన్నారాయణుని సర్వసులభుడు అనే అంశాలపై ప్రసంగించారు. వీరి ప్రసంగాన్ని భక్తులు ఆసక్తిగా విన్నారు. ఈ కార్యక్రమాన్ని యతిరాజ భవన కార్యదర్శి దోర్బల హేమప్రకాష్, ఉపాధ్యక్షుడు కంతేటి శ్రీనివాసగుప్తా, కోశాధికారి మాజేటి మోహన మురళి, కంతేటి లక్ష్మి, చక్కా హిమవతి సువర్చలాదేవి, కొప్పర్తి రవి శంకర్, ఉదయగిరి సతీష్, వేముల కుమారస్వామి, వేముల శ్రీలక్ష్మి పర్యవేక్షించారు.

గోవులను వధిస్తే కఠిన చర్యలు

పెడన సీఐ కె.నాగేంద్రప్రసాద్



పెడన: పెడనలో ఎట్టి పరిస్థితిలో గోవధ చేయొద్దని, కేంద్ర ప్రభుత్వం నిషేధాజ్ఞలను జారీ చేసిందని పెడన సీఐ కె.నాగేంద్ర ప్రసాద్ అన్నారు. మంగళవారం సాయంత్రం పెడన పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్, ఎస్ఐ సత్యనారాయణలతో పాటు ముస్లిం పెద్దలు జమీయా మసీదు కమిటీ అధ్యక్షుడు అబ్దుల్‌ఖాదర్, కార్యదర్శి అయూబ్‌ఖాన్, ఇతర పెద్దలు అబ్దుల్‌ఖయ్యూం (హస్ను), హమీదుల్లా తదితరులు పాల్గొన్నారు. గత ఏడాది గోవధ చేసినట్లుగా కేసు నమోదై ఉందని, ఈ నేపథ్యంలో పెడన పట్టణంపై కేంద్రం కూడా ప్రత్యేక దృష్టిపెట్టిందని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితులలో గోవధకు పాల్పడవద్దని తెలిపారు. అటువంటి చర్యలకు ఉపక్రమిస్తే శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 6వ తేదీ నుంచి పదో తేదీ వరకు నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని తెలిపారు.

ముందస్తు పరీక్షలతో సంపూర్ణ ఆరోగ్యం



క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్

కృత్తివెన్ను: క్యాన్సర్ మహమ్మారిని ముందుగానే గుర్తిస్తే 90 శాతం ప్రాణాపాయం లేకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండగలమని అందుకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరం ఏర్పాటు చేసినట్లు మచిలీపట్నం ఎంపీ బాలశౌరి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. మంగళవారం మండలంలోని చినగొల్లపాలెం దీవిలో ఉచిత క్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ, కలెక్టర్‌లు మాట్లాడుతూ నేటి సమాజంలో క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయని, వీటిని గుర్తించడంలో ఆలస్యం జరగడంతో ప్రాణాలు పోతున్నాయన్నారు. అందుకే పేదప్రజల ఆరోగ్య సంరక్షణలో భాగంగా మచిలీపట్నం భారత్ ఎలక్ట్రానిక్స్, ఎంపీ ల్యాండ్స్ నుంచి నిధులతో క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. తీరప్రాంతంలో ఇటువంటి క్యాంపులు ఏర్పాటు చేయడం ఎంతో మంచి నిర్ణయమని స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ఈ శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి శర్మిష్ఠ పర్యవేక్షించారు. ఈ శిబిరంలో 12 మంది వైద్యుల బృందం సేవలందించారని, 180 మంది మహిళలకు పరీక్షలు చేసినట్లు రేడియాలజీ అధికారి అంజనీకుమార్ తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు రత్నకుమారి, స్థానిక వైద్యులు, నాయకులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో భూమి సారవంతం

వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటలక్ష్మి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి

చల్లపల్లి: భావి తరాలకు ఆరోగ్యవంతమైన, సారవంతమైన భూమిని అందించాలంటే రైతులు వాడే రసాయనిక ఎరువుల్లో కనీసం 30 శాతం అయినా సేంద్రియ ఎరువులను ఉపయోగించాలని కృషి వి/్ఞాన కేంద్రం సస్యపోషణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి రైతులకు సూచించారు. ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం, కృషి వి/్ఞాన కేంద్రం ఘంటసాల ఆధ్వర్యంలో మండలంలోని యార్లగడ్డ గ్రామంలో మంగళవారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ సదస్సును నిర్వహించారు. ఎంఏవో సాయి సింధు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెంకటలక్ష్మి మాట్లాడుతూ పూర్తిగా రసాయనిక ఎరువులు వాడటం వల్ల ప్రస్తుతం పంట దిగుబడులు ఎక్కువగా వచ్చినప్పటికీ భవిష్యత్తులో ఈ భూములన్నీ చౌడు భూములుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతులు 30 శాతం సేంద్రియ ఎరువులు, 70 శాతం రసాయనిక ఎరువులు వాడుకోవటం వల్ల భూమి నిత్యం సారవంతంగా ఉంటుందని వివరించారు. పోలంలో వాడుకునేందుకు జీవన ఎరువులు ఘంటసాలలోని కృషి వి/్ఞాన కేంద్రంలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ (పెదవేగి) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కళ్యాణ్‌బాబు, ఉయ్యూరు చెరకు పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ భాస్కర్‌రెడ్డి, ఉద్యాన శాఖాధికారిణి జె.కీర్తి, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. అనంతరం ఇఫ్కో ఆధ్వర్యంలో డ్రోన్ సహాయంతో పంట పొలాలపై మందుల పిచికారీ విధానాన్ని రైతులకు వివరించారు.

చోడవరంలో..

చోడవరం(నాగాయలంక): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి వి/్ఞాన కేంద్రం(ఘంటశాల) సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని చోడవరం గ్రామంలో మంగళవారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ సదస్సు నిర్వహించారు. బందరులోని వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ కె.నాగేంద్రరావు మాట్లాడుతూ వరిలో నూతన వంగడాలు, వివిధ నేలలకు అనువైన వరి రకాలు, యాజమాన్య పద్ధతులు వివరించారు. కేవీకే మత్స్యశాస్త్రవేత్త జె.జస్వంత్ కుమార్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశాలను చెప్పారు. భారతీయ ఆయిల్ పామ్ పరిశోధనా స్థానం (పెదవేగి), ఎంఏవో ఏ.సంజీవరావు, మండల పశు వైద్యాధికారి డాక్టర్ సాయిమౌనిక తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దకే రేషన్ ఇవ్వండి

జిల్లా పౌరసరఫరాల అధికారి వి.పార్వతి



వృద్ధుడికి రేషన్ అందజేస్తున్న డీఎస్‌వో పార్వతి, పక్కన తహసీల్దారు అనిల్‌కుమార్ తదితరులు

పెడన: రేషన్ దుకాణాల పరిధిలో ఉన్న 65 సంవత్సరాలు దాటిన వృద్ధులకు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి రేషన్ ఇవ్వాలని, వారి నుంచి ఫిర్యాదులు వస్తే మాత్రం ఉపేక్షించేది లేదని జిల్లా పౌరసరఫరాల అధికారి వి.పార్వతి అన్నారు. మంగళవారం ఆమె పట్టణంలో తూర్పు తెలుగుపాలెం, మండల పరిధిలోని మడక గ్రామాల్లో వృద్ధులకు రేషన్ అందిస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఆమె ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ ప్రతి నెలా రేషన్ ఇంటికి తీసుకువచ్చి ఇస్తారని, మీరు దుకాణానికి వెళ్లి తెచ్చుకోవాల్సిన అవసరం లేదన్నారు. మీకు రేషన్ అందకపోతే తెలిసిన వారి ద్వారా సచివాలయంలో తెలియజేయాలని సూచించారు. ఈమెతో పాటు ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్, వీఆర్వో మధు తదితరులు ఉన్నారు.

బూటకపు ఎన్‌కౌంటర్లు నిలిపివేయాలి

ఏపీ పౌరహక్కుల సంఘం జిల్లా కమిటీ సభ్యుడు జక్కా



జక్కా కేశవరావు

ఘంటసాల: కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం జరుపుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలని ఏపీ పౌరహక్కుల సంఘం జిల్లా కమిటీ సభ్యుడు జక్కా కేశవరావు కోరారు. ఘంటసాల గోటకంలో మంగళవారం విలేకర్లతో కేశవరావు మాట్లాడారు. నల్లమల అడవుల్లో ఛత్తీస్‌గఢ్ మడ అడవుల్లో ఇటీవల 27 మందికి పైగా మావోలను బూటకపు ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపారని ఆరోపించారు. పీఆర్పీఎఫ్ బెలాలియన్ పోలీసులు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు 27 మందిని కేంద్ర ప్రభుత్వం పొట్టనబెట్టుకుందన్నారు. కేంద్ర కమిటీ కార్యదర్శి కేశవరావుకు సుమారు 70 మందితో రక్షణ ఉంటుందని, కేశవరావును ఎక్కడో పట్టుకుని వచ్చి ఆపరేషన్ కగార్ పేరుతో 6 వేల మంది పోలీసులు చుట్టు ముట్టి ఏకపక్షంగా కాల్చిచంపారన్నారు. నల్లమల మడ అడవుల్లో ఎన్‌కౌంటర్ జరిగినట్లు కట్టుకథలు అల్లారన్నారు. కాల్చి చంపిన 27 మంది మృతదేహాలను వారి తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు అప్పగించకపోగా ప్రభుత్వమే పోలీసుల చేత మృతదేహాలను దహనం చేయించారు. కేశవరావు సోదరులు కోర్టులో పిటీషన్ వేసిన లెక్క చేయకుండా దహనం చేయించడం బాధాకరమన్నారు. పీఎం మోడీ, హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేసి పోలీసులను వెనకకు మళ్లించాలని ఏపీ పౌరహక్కుల సంఘం తరుపున డిమాండ్ చేస్తున్న కేశవరావు తెలిపారు.